సంగారెడ్డి
నమస్తే తెలంగాణ
మంగళవారం 27 ఆగస్టు 2024
TUESDAY, AUGUST 27, 2024



## సింగూరుకు స్వల్ప వరద

పుల్కల్, ఆగస్టు 26: సింగూరు ప్రాజెక్టుకు వరద వస్తున్నది. కొద్దిరోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతున్నది. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 1,895 క్యూసెక్కులు నీరు వచ్చి చేరినట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.646 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఔట్ ఫ్లో 391 క్యూసెక్కులు దిగువకు వెళ్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు అధికం కావడంతోనే వరద నీరు ప్రాజెక్టులోకి పెరుగుతున్నట్లు పేర్కొన్నారు. వరద తీవ్రతను గమనిస్తూ అధికారులు ప్రాజెక్టు వద్దే ఉంటున్నారు. ప్రాజెక్టు మీటర్లలో 523.600 మీటర్ల నీటి ఎత్తుకు గానూ, ప్రస్తుతం 520.220 మీటర్లలో ఉంది. తాలెల్మ ఎత్తిపోతల పథకానికి 31 క్యూసెక్కులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, వృథాగ వెళ్తున్న నీరు 210 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 391 క్యూసెక్కులుగా ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

## మదర్ థెరిస్సాకు నివాళి

కోహీర్, ఆగస్టు 26: జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, భారతరత్న మదర్ థెరిస్సా 114వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అభాగ్యుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని ఆమె సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో జయరాజ్, జనార్దన్, కిట్టు, శ్యామ్ సుందర్, మోహన్, అజయ్, జాకబ్, తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

# ఓపీ ఉన్నా.. సౌకర్యాలు సున్న

- పుల్కల్ దవాఖాన దుస్థితి
- ప్రారంభానికి నోచుకోని కొత్త బిల్డింగ్
- ఇబ్బందులు పడుతున్న రోగులు

పుల్కల్, ఆగస్టు 26: పుల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని దవాఖానలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల నుంచి రోజుకు సుమారు 120 నుంచి 150 మంది వరకు రోగులు దవాఖానకు వస్తారు. సరిపడా బెడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి మండలానికి సంబంధించి ఇదే పెద్ద దవాఖాన కావడంతో ప్రతి సోమవారం గర్భిణులు సైతం చెకప్ కోసం ఇక్కడికే వస్తుంటారు. ఈ దవాఖాన భవనం శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు బిల్డింగ్ పెచ్చులూడి ఎప్పుడు మీద పడుతుందోనని రోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సమస్యలను గుర్తించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.1.56 కోట్లతో కొత్త బిల్డింగ్ నిర్మించారు. కానీ, ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పల్లెల్లో పారిశుధ్యం లోపంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో దవాఖానకు రోగుల తాకిడీ పెరిగింది. రోగుల ఇబ్బందులు తొలిగించాలంటే కొత్త బిల్డింగ్‌పై మంత్రి దామోదర ప్రత్యేక దృష్టి సారించి అన్ని సౌకర్యాలు కల్పించి ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు. భవనంలో విద్యుత్ సౌకర్యంతోపాటు మరి కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నూతన బిల్డింగ్‌కు వెళ్లేందుకు దారి సౌకర్యం ఇబ్బందిగా ఉందని, సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి కొత్త బిల్డింగ్‌ను అందుబాటులోకి తేవాలని కోరుతామని డాక్టర్ సాయికిరణ్ పేర్కొన్నారు.



పాత బిల్డింగ్‌లో గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్న స్టాఫ్ నర్స్



పెచ్చులూడి ఎప్పుడు రోగులపై పడుతుందో తెలియని పాత దవాఖాన



పెచ్చులూడుతూ ప్రమాదకరంగా పాత దవాఖాన భవనం



ప్రారంభానికి నోచుకోని కొత్త దవాఖాన భవనం

## గుండెపోటుతో ఘనపూర్ మాజీ సర్పంచ్ మృతి



విఠలయ్య(ఫైల్)

పటాన్‌చెరు, ఆగస్టు 26: ఘనపూర్ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు ముత్తంగి విఠలయ్య(55) గుండెపోటుతో మృతి చెందారు. పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన ముత్తంగి విఠలయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం గుండెపోటుకు గురై మృతి చెందాడు. విఠలయ్య 2013 నుంచి 2018 వరకు సర్పంచ్‌గా సేవలందించారు. ఘనపూర్‌ను అభివృద్ధి పథంలో ముందుంచారు. గ్రామ సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా ఉండేవారు. విశాఖ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ రాజకీయాల్లోకి వచ్చారు. అందరితో కలుగోలుగా ఉంటూ గ్రామాభివృద్ధికి పాటుపడే విఠలయ్య మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది. గ్రామస్తులు, పలువురు నాయకులు విఠలయ్య మృతికి సంతాపం తెలిపారు.

## ట్రాలీ ఢీకొని మహిళ మృతి

రామచంద్రాపురం, ఆగస్టు 26: ట్రాలీ ఢీకొట్టడంతో ఓ మహిళా మృతి చెందిన ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్సీపురం కాంగ్రెస్ కార్యాలయం ఎదుట యూటర్న్ వద్ద గుర్తుతెలియని మహిళ(45) సోమవారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న క్రమంలో లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపునకు వెళ్తున్న అశోక్‌లేలాండ్ ట్రాలీ అతివేగంగా వచ్చి మహిళను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రోడ్డు పక్కన హోండా యాక్టివాను కూడా ఢీకొట్టడంతో అసాబ్ అనే యువకుడి ఎడమ కాలు, కుడి చేతికి గాయాలయ్యాయి. రోడ్డు సేఫ్టీ కానిస్టేబుల్ దశరథ్ ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

సిర్గాపూర్, ఆగస్టు 26! మండల పరిధిలోని పోచాపూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ అజీం కుమారుడి వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. వారికి మంజూరైన రూ.45 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం ఖేడ్‌లో సీనియర్ కాంగ్రెస్ నేత నాగేశ్‌షెట్కార్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, వీరయ్యాచారి, లక్ష్మయ్య, కిష్టాగౌడ్, అశోక్ తదితరులు ఉన్నారు.

**పుల్కల్‌లో..**

పుల్కల్, ఆగస్టు 26: పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన బెస్త ప్రశాంత్, బీరయ్య, వడ్డె మంజులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, గోవర్ధన్, బోయిని శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, మన్నె విఠల్, మల్లారెడ్డి, భాస్కర్, మ్యాతరి శ్రీనివాస్ ఉన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నాగల్‌గిద్ద, అగస్టు 26: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని జడ్పీహెచ్‌ఎస్ నాగల్‌గిద్ద కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శంకర్ పేర్కొన్నారు. వే 2 హెల్ప్ యూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వరంలో సోమవారం నాగల్‌గిద్ద, ఏస్గి పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మారుతి, అనిల్‌కుమార్, విజేందర్‌రెడ్డి, కాశీరాం, మల్లేశ్వరి ఉన్నారు.



గుమ్మడిదల: మంభాపూర్ సుక్కగట్టు వీరభద్రస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న భక్తులు

## ఆలయాల్లో శ్రావణమాస పూజలు

*శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఆలయాలు శుక్రవారం సందడిగా మారాయి. భక్తులు దగ్గర్లోని ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద దాతలు భక్తులకు అన్నదానం చేశారు. రాయికోడ్ వీరభద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కోహీర్ మండలంలోని బడంపేట రాచన్నస్వామి దేవాలయంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. గుమ్మడిదల మండలంలోని మంభాపూర్ వీరభద్రస్వామి ఆలయం, గుమ్మడిదల మండలం వీరన్నగూడంలోని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.*

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 26*



రాయికోడ్: బోడపల్లి మాజీ సర్పంచ్ బిందూరామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

## రోడ్డు పక్కన పొంచివున్న ప్రమాదం

హత్నూర, ఆగస్టు 26: మండల కేంద్రమైన హత్నూర మొదటివార్డులో సీసీ రోడ్డు పక్కనున్న సింగిల్‌ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచివుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీరోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో పిల్లలు అటువైపు వెళ్లేటప్పుడు ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని భయాందోళనకు గురవుతున్నారు. అటుగా వెళ్లే మూగజీవాలు సైతం కారెంట్ షాక్‌కు గురై మృతిచెందే ప్రమాదం ఉన్నదని చెబుతున్నారు. రోడ్డు పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలిగించి మరో చోటుకు మార్చాలని పలుమార్లు విద్యుత్ అధికారులను కోరినా స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సమస్యను గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు తరలించాలని కోరుతున్నారు.



హత్నూరలో సీసీరోడ్డు పక్కన చేతికందే ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

## విద్యలో గార్డెన్ దొర కృషి ఎనలేనిది



గార్డెన్ దొరకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, తదితరులు

కోహీర్, ఆగస్టు 26: మెథడిస్ట్ చర్చితో పాటు ఎంఆర్‌హెచ్‌ఎస్ పాఠశాలను నిర్మించి విద్యాభివృద్ధికి గార్డెన్ దొర ఎంతగానో కృషి చేశారని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని మెథడిస్ట్ చర్చి ఆవరణలో గార్డెన్ దొర 32వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెథడిస్ట్ చర్చి ఆవరణలో ఎంఆర్‌హెచ్‌ఎస్ పాఠశాలను ప్రారంభించి వేలాదిమంది విద్యార్థులను ఉచితంగా చదివించారని చెప్పారు. అనంతరం ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆహ్వానం

గుమ్మడిదల, ఆగస్టు 26: మండలంలోని బొంతపల్లి పంచాయతీ పరిధిలో రేణుకా ఎల్లమ్మ, పోచమ్మతల్లి ఆలయాల పునఃనిర్మాణాకి నిర్వహించే భూమిపూజకు ఎంపీ, ఎమ్మెల్యేలను ఆలయ కమిటీ ఆహ్వానించింది. సోమవారం కమిటీ అధ్యక్షుడు కావలి శంకర్‌యాదవ్, సభ్యులు రాఘవరెడ్డి, గ్యారల మల్లేశ్, సురభి కుమార్‌గౌడ్, కమ్మరి రాజు తదితరులు ఎంపీ రఘునందర్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నీలం మధును ఆహ్వానించారు. ఈ నెల 30వ తేదీన ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్‌హుస్సేన్, ఇప్ప వినోద్, భిక్షపతిరెడ్డి ఉన్నారు.



ఎంపీ రఘునందర్‌రావును ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సిర్గాపూర్, ఆగస్టు 26: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోమవారం పర్యటించి పలువురిని పరామర్శించారు. కడ్పల్ గ్రామానికి చెందిన మల్లేశ్‌కు ఇటీవల కరెంట్ షాక్ తగిలింది. ఆయనను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఇదే గ్రామానికి చెందిన రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ నారాయణ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వాసర్ గ్రామంలో షరీఫ్ భార్య ఇటీవల మరణించింది. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఇదే గ్రామంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శివాజీరావు, ప్రముఖ న్యాయవాది అనంతరావు కులకర్ణిని మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ విషయాలపై చర్చించారు. ఈయన వెంట మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పుండ్లిక్, బాబుపటేల్, రమేశ్, భూంరెడ్డి, హన్మంత్‌రెడ్డి, హాజీ, రఫీక్, రాజు ఉన్నారు.




సిర్గాపూర్: వాసర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



ఆకతాయిల దాడిలో ధ్వంసమైన జిన్నారం జూనియర్ కళాశాల కిటికీ అద్దాలు

# ఆకతాయిల అరాచకం

- జూనియర్ కళాశాలలో ఇష్టారాజ్యం
- సెలవు రోజుల్లో మందు పార్టీలు
- బోరు మోటర్ అపహరణ, కిటికీ అద్దాలు, స్విచ్ బోర్డులు ధ్వంసం
- ప్రహరీ లేక జులాయిలకు అడ్డాగా జిన్నారం జూనియర్ కళాశాల



పగిలిన స్విచ్‌బోర్డు, విరిగిన ట్యాంక్ పైపు

జిన్నారం, ఆగస్టు 26: కార్పొరేట్ కళాశాలకు దీటుగా ఏర్పాటైన జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆకతాయిల బెడద వెంటాడుతున్నది. కిటికీ అద్దాలు, కరెంటు స్విచ్ బోర్డులు ధ్వంసం చేశారు. బోరు మోటరు, కేబుల్ వైర్లను రెండుసార్లు ఎత్తుకెళ్లారు. కంప్యూటర్ ల్యాబ్ తాలాన్ని పగులగొట్టారు. ట్యాంక్‌ల నుంచి టాయిలెట్లకు ఉన్న పైపులైన్‌లను ధ్వంసం చేశారు. దీంతో కళాశాలలో నీటి కరువొచ్చింది. సెలవు రోజుల్లో కళాశాల ఆవరణను మందుబాబులు అడ్డాగా చేసుకొని తాగిన బాటిళ్లు, వేస్టేజ్‌ను వదిలేసి వెళ్తున్నారు. ఇదంతా కళాశాలకు ప్రహరీ లేకపోవడంతోనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.

***అద్దాల స్థానంలో అట్టలు***

కళాశాల సమయం ముగిసిన తర్వాత సాయంత్రం, సెలువు రోజుల్లో ఆకతాయిలు కళాశాలలోకి వచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కిటికీ అద్దాలను పగులగొట్టడంతో అధ్యాపకులు అట్టలు అమర్చారు. మరికొన్ని కిటికీలకు పరదాలు వేసి సాయంత్రం తీసేస్తున్నారు. బోరు బోటరును ఎత్తుకెళ్లడంతో నీటి సమస్య తలెత్తింది. దీంతో ఇటీవల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణకుమార్ మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను కళాశాల వరకు సొంత ఖర్చుతో వేయించారు. కిటికీలు ఎస్ఎస్ మెష్, గేటు ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఒక్కో రోజు మందుబాబుతు తాగిపడేసిన బాటిళ్లు, చెత్తను అధ్యాపకులే తొలిగించాల్సిన పరిస్థితి వచ్చిందంటే సమస్య ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కళాశాలకు వెనుకవైపు ప్రహరీ నిర్మాణం ఖర్చుతో కూడుకున్నది కావడంతో ప్రస్తుతానికి ప్రీకాస్ట్ వాల్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.



ప్రహరీ నిర్మించాల్సిన కళాశాల ఆవరణ

### కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి



జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ అత్యవసరం. కళాశాల ముగిసిన తర్వాత, సెలవు రోజుల్లో ఆకతాయిలు అడ్డాగా చేసుకుంటున్నారు. బోరు మోటారు ఎత్తుకెళ్లడంతో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశాం. ప్లంబింగ్ అవసరం ఉంది. కళాశాల ప్రవేశ మార్గంలో గేటు, కిటికీలకు ఎస్ఎస్ మెష్ ఏర్పాటు చేయిస్తున్నా. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులకు వివరించా. విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కళాశాలలో మౌలిక వసతులు కల్పించి ప్రహరీ నిర్మించాలి.

*- కృష్ణకుమార్, జిన్నారం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్*

# కృష్ణం వందే జగద్గురుం

*శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సోమవారం ఆలయాలు భక్తులలతో కిక్కిరిశాయి. ఉదయం నుంచే ఆలయాలకు చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. చిన్నారులు గోపికా, కృష్ణుడి వేషధారణలో అలరించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను గోపిక, కృష్ణుడి వేషం వేసి సంబురపడ్డారు. పలు చోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమాలు సంబురంగా జరిగాయి.*


*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 26*




నారాయణఖేడ్: రాధాకృష్ణ మందిర్‌లో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి




పుల్కల్: ఉట్టి కొడుతున్న చిన్నారులు



పటాన్‌చెరు: పూజలు చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్



రామచంద్రాపురం: అశోక్‌నగర్‌లో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేశ్



బొల్లారంలో..



సంగారెడ్డి కలెక్టరేట్: మురళీ కృష్ణాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



అందోల్: జోగిపేటలో ఉట్టికొడుతున్న చిన్నారులు



జిన్నారం: కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు



న్యాల్‌కల్: హద్నూర్‌లో..



కోహీర్: జహీరాబాద్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు



ఝరాసంగం: దత్తగిరిలో ఆశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



జహీరాబాద్‌లో గోవులకు ఫలాలను తినిపిస్తున్న భక్తులు